ప్రైవేటు దిక్కు..

- గ్రామాలకు రోడ్లు ఉన్నా బస్సులు నడపని ఆర్టీసీ
- అధికారుల అలసత్వం
- ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- అధిక చార్జీలతో ఆర్థిక భారం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, గ్రామస్తులు



కమ్మర్‌గాంలో వేచి చూస్తున్న ప్రయాణికులు

పెంచికల్‌పేట్: మండలంలోని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించినా ఆర్టీసీ అధికారుల అలసత్వంతో కొండపల్లి, లోడుపల్లి, అగర్‌గూడ గ్రామాలు బస్సు సౌకర్యానికి నోచుకోలేకపోతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అధిక చార్జీలు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

బీటీ రోడ్డు ఉన్నా..

మండల కేంద్రం నుంచి లోడుపల్లి మీదుగా కొండపల్లికి 10 కి.మీ. ఐదేళ్ల క్రితం ప్రభుత్వం బీటీ రోడ్డును నిర్మించింది. గతంలో ఒకటి, రెండుసార్లు గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినా అధికారులు అనంతరం సర్వీసులను రద్దు చేయడంతో నిత్యం పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాల, బెజ్జూర్ జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులు నానా కష్టాలు పడుతూ గమ్యానికి చేరుకుంటున్నారు. గతంలో అగర్‌గూడ గ్రామానికి బీటీ నిర్మించినా నేటికి ఆర్టీసీ సేవలకు నోచుకోలేదు. దీంతో గ్రామం నుంచి అనేకమంది అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవడానికి ప్రైవేటు వాహనాలు ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్నారు.

మండల కేంద్రానికి చేరుకోవడానికి 40 కి.మీ

మండల కేంద్రం నుంచి వయా అగర్‌గూడ మీదుగా కమ్మర్‌గాం గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బెజ్జూర్ నుంచి పెంచికల్‌పేట్ చేరుకోవాలంటే దాదాపు 40 కి.మీ పైగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. అదే అగర్‌గూడ మీదుగా బస్సును ఏర్పాటు చేస్తే కేవలం 15 కి.మీ దూరం ప్రయాణం చేస్తే మండల కేంద్రానికి చేరుకుంటామని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కమ్మర్‌గాం గ్రామానికి అగర్‌గూడ మీదుగా, కొండపల్లికి లోడుపల్లి మీదుగా బస్సు సౌకర్యం కల్పించి సమస్య తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యాన్ని చేరుకుంటున్నాం. పెంచికల్‌పేట్ వయా అగర్‌గూడ మీదుగా కమ్మర్‌గాం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి. తమకు దూర,ఆర్థికభారం తగ్గుతుంది. అధికారులు పట్టించుకోవాలి.

– మడుప శ్రీనివాస్, కమ్మర్‌గాం

క్లుప్తంగా

బాలికలను చదివించాలి



బేటీ బచావో..బేటీ పడావో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్,అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: బాలికలకు బతుకునిచ్చేలా చదివించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బేటి బచావో–బేటి పడావో పోస్టర్‌ను కలెక్టరేట్ కార్యాలయంలో ఆ శాఖ పీడీ సావిత్రితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. అన్ని వర్గాల్లో ఆడపిల్లల చదువుకు ప్రాముఖ్యత ఇవ్వడం లేదని ఈ ఆలోచనల్లో మార్పు రావాల్సి ఉందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని మాలన్‌గొందిలో స్త్రీ నిధి రుణాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీతో ప్రభుత్వం అందించే రుణాలను వృథా ఖర్చు చేయకుండా వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించుకోవాలన్నారు. 15 సంఘాలకు 144 మంది సభ్యులకు రూ.56 లక్షలు అందించినట్లు తెలిపారు. స్త్రీనిధి మేనేజర్ ఉదయ్‌కుమార్, సర్పంచ్ పార్వతి, తిరుపతి, నాయకులు ముషీర్, గోపాల్, పద్మ తదితరులు ఉన్నారు.

'బీఆర్‌ఎస్ అవినీతిని ప్రజల్లో ఎండగడుతాం'

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతిని ప్రజల్లో ఎండగడుతామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబం మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయల అంచనాలు పెంచి కమీషన్లు దండుకుందని ఆరోపించారు. ల్యాండ్‌మాఫియా, సాండ్, లిక్కర్ మాఫియా ద్వారా దోచుకున్న డబ్బును ఇతర దేశాల్లో పెట్టుబడి పెడుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఇచ్చిన కేంద్రం నిధులను రాష్ట్రప్రభుత్వం కాజేసిందని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు శ్రావణ్‌గౌడ్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



అర్చకుడికి వెండి అభిషేకపాత్ర అందజేస్తున్న భక్తుడు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర ఆలయానికి మంచిర్యాలకు చెందిన పంచదార అశోక్ సోదరులు రూ.50 వేల విలువ చేసే వెండి అభిషేక పాత్రని విరాళంగా ప్రకటించారు. అర్చకుడు చందావార్ బాలేశ్వరశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఇందారపు మధుకరశర్మ, శ్రీధర్‌శర్మ, రవిచంద్రశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మండల బౌద్ధ కమిటీ ఎన్నిక

దహెగాం: మండల బౌద్ధకమిటీని తాలుకా అధ్యక్షుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుమ్మరి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా ప్రేంసాగర్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, సంయుక్త కార్యదర్శిగా శంకర్, ప్రచార కార్యదర్శులుగా దుర్గం సోమయ్య, గౌతం, దుర్గం కేదార్ ఎన్నికయ్యారు. మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో సోమవారం జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా హాజీపూర్, నస్పూర్, మంచిర్యాల మండలాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో పోచయ్య, సమన్వయ కార్యకర్తగా యోగేశ్వర్ వ్యవహరించగా ఎమ్మార్పీ బాధ్యులు నాగేంద్రబాబు, గురవయ్య, అంజద్‌ఖాన్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కృషి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మిట్ట వెంకన్న తెలిపారు. జిల్లాకేంద్రంలో సోమవారం నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ భవనానికి అందరితో కలిసి కృషిచేస్తానని పేర్కొన్నారు. జిల్లా కమిటీని త్వరలో ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి రామయ్య, చంద్రయ్య, సదాశివ్, సతీశ్, వెంకటేశం, తిరుపతి, నారాయణ, శంకర్, శ్రీనివాస్, సంతోష్, దేవేందర్, వెంకన్న, జిల్లాలోని మున్నూరు కాపులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తాం



మాట్లాడుతున్న రహమాన్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. జర్నలిస్టులకు జర్నలిస్టు బంధుతోపాటు ఇంటి స్థలాలు, హెల్త్‌కార్డులు తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13 నుంచి దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ విలేకరులకు వృత్తిలో నైపుణ్యం పెంపొందించేందుకు త్వరలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు ప్రకాశ్‌గౌడ్, అడప సతీశ్, కృష్ణంరాజు, వారణాసి శ్రీనివాస్‌రావ్, తూమోజు సురేష్‌చారి, చీల నితీశ్, బిక్కాజి, అబ్దుల్ హస్నన్, జమీల్, నవీన్‌గౌడ్, సోజర్, రాధేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

- జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కృష్ణారావు

బెజ్జూర్: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. అనంతరం రైతు వేదిక వద్ద నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరం లాంటివన్నారు. ప్రమాదాలకు గురై, అనారోగ్యం బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం కోసం పేదలకు సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేసి ఆదుకుంటున్నారని అన్నారు. జిల్లా రైతు సమితి అధ్యక్షుడు జగ్గాగౌడ్, ఎంపీపీ డోకే రోజా రమణి, జెడ్పీటీసీ పుష్పలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఓంప్రకాశ్, మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, సహకార సంఘం మాజీ చైర్మన్ వెంకన్న, తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ రాజేష్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, ఎంపీటీసీలు శ్రీను, సర్పంచ్‌లు హన్మంత్, సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ ఇస్తారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మేరీ కేవీ, పీడీ ప్రసాద్ తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో పెద్దపల్లిలో తెలంగాణ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో సార్థాగౌరి, జశ్వంత్ బంగారు పతకం, లాక్షిక, మనీష్ వెండి పతకం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం



స్వామివారికి పట్టువస్త్రాలను అలంకరిస్తున్న అర్చకులు



కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు



వీక్షిస్తున్న భక్తులు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ధర్మ ప్రచారకులు

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. టీటీడీ, ఆలయ నిర్వాహకులు బాదావత్ ప్రకాశ్, ధన్‌రాజ్, జగదీశ్, సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు తరలివచ్చి వీక్షించారు. ముందుగా వేంకటేశ్వరస్వామి, లక్ష్మి, పద్మావతి ప్రతిమలకు పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె, పూలతో అభిషేకం చేశారు. అనంతరం హోమం, నవగ్రహ, తదితర పూజలు నిర్వహించారు. టీటీడీ నుంచి పట్టువస్త్రాలు, కుంకుమ, బియ్యాన్ని తీసుకువచ్చారు. సాయంత్రం రథం ఊరేగింపు చేపట్టారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. టీటీడీ నుంచి ధర్మప్రచారకులు గొల్లపల్లి సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటనారాయణ శర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు


కూరగాయలు	కిలో (రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
టమాట	20
బీరకాయ	60
కాకరకాయ	40
బెండకాయ	40
అలసంత	60
దొండకాయ	80
మిర్చి	80
సోరకాయ	60
చిక్కుడుకాయ	60
గోబి (పూల్)	40
క్యాబేజి	60

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కొమ్రంభీం ఏ/సీ): వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య

కాగజ్‌నగర్ (వెంకటరమణ, ఏ/సీ): వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య



భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



విగ్రహానికి భక్తుల పాలాభిషేకం



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని వాసవీమందిరంలో సోమవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో అర్చకులు ముదిగొండ రాజశేఖరశర్మ, శ్రీధర్ శర్మ, చిరంజీవిశర్మ ఆధ్వర్యంలో వాసవీమాతకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తాటిపెల్లి దిలీప్, గంధం శ్రీనివాస్, పాపిని శంకర్, గుండ ప్రమోద్, కాచం ప్రకాశ్, రావుల శంకర్, పిన్న వివేక్, కొలిప్యాక వేణుగోపాల్, గుండ నాగేశ్, వాసవీ క్లబ్ ప్రతినిధులు కొలిప్యాక రవి, చెల్ల ప్రశాంత్, గుండ సాయి, అభిలాష్ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



జన్కాపూర్‌లో చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు



కెరమెరిలో పూలమాల వేస్తున్న ఎంపీపీ మోతిరాం, నాయకులు

కెరమెరి: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మా ట్లాడారు. అహింసతో స్వరాజ్యం సిద్ధిస్తుందని గాంధీజీ పోరాటం సాగిస్తే, బోస్ మాత్రం సాయుధ పో రాటం ద్వారానే దేశాన్ని సాధించవచ్చని నమ్మిన మ హా నాయకుడని అన్నారు. సర్పంచ్ జగన్నాథ్‌రావు, నాయకులు ధర్మూ, భరత్ భుషణ్, ఆత్రం రాము, సోము, మారుతి ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, నాయకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: రవీంద్రనగర్ గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'కంటి వెలుగు' పకడ్బందీగా నిర్వహించాలి



పెంచికల్‌పేట్: వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం

పెంచికల్‌పేట్: కంటి వెలుగు శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం అన్నారు. మండలంలోని పెంచికల్‌పేట్ పంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలను నిర్వహించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి శిబిరంలో వంద శాతం పరీక్షలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కంటి వెలుగు అధికారి వైద్యులు సురేష్, నేహా, సురేందర్, సిబ్బంది ఉన్నారు.

కౌటాల: కౌటాల పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి వెలుగు ప్రోగాం జిల్లా అధికారి సునీల్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా కంటి వెలుగు పరీక్షలు చేయాలని తెలిపారు. అవసరైమన వారికి కళ్లద్దాలు ఇవ్వాలని, పరీక్షలు అవసరమైన వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రజల రద్దీ లేకుండా ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వైద్యాధికారి నవత, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉప సర్పంచ్ పి తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, హెఈఓ సోనాజీ, సిబ్బంది స్నేహా, పెంటుబాయి ఉన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు పరిశీలించారు. సోమవారం ఓపి 85, కళ్లద్దాలు 37 మందికి అందించామని, శస్త్రచికిత్సల కోసం 17 మందిని గుర్తించామని, ఐదుగురికి అద్దాల కోసం ఆర్డర్ పెట్టామని కంటి వెలుగు ఇన్‌చార్జి వైద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, వైద్య సిబ్బంది, నాయకులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు కోరారు. చిర్రకుంటలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్ మోహన్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

దహెగాం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ నాగరాజు పేర్కొన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్ ఆదేశాల మేరకు మండలంలోని దిగిడ గ్రామంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు, బియ్యం, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. యువకులు, విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వన్యప్రాణులను వేటాడడానికి విద్యుత్ తీగలు, ఉచ్చులు అమరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, కోడి పందేలు ఆడినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సై సనత్‌కుమార్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



యువకులకు కిట్ అందిస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ గ్రామంలోని యువకులకు ఎస్సై విజయ్‌కుమార్ సోమవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

ఈరోజు

వేలం పాట

కౌటాల: మండలంలోని తాటిపల్లి సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధిహనుమాన్ ఆలయం వద్ద వచ్చేనెల 2న పలు దేవతల నూతన విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, దేవతల ఫొటోలు, దారాలు, టీ, టిఫిన్ దుకాణాల ఏర్పాటుకు వేలం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు సోమవారం తెలిపారు. మంగళవారం ఆలయంలో ఉదయం 11.30 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. దుకాణాదారులు 50 శాతం నగదును ముందుగా చెల్లించాలన్నారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ డబ్బుల నానయ్య అధ్యక్షతన సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ శాఖల నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.